# ఆశకు అంతు ఎక్కడ?

1

ధనరాజ్ పెద్ద బిల్డింగ్ చౌకగానే లేవదీశాడు, తనతో పని ఉన్నవారి అవసరం గుర్తించి, వారికొక్కవల్సినది చేకూర్చి పెట్టి, తనకొక్కవల్సిన బిల్డింగ్ మెటీరియల్ చౌకగా పొందేవాడు కూలీలకూ, మేస్త్రీకి మాత్రం నిక్కచ్చిగా చెల్లించాల్సి వచ్చింది, ఒక బ్రాహ్మడి కూతురుకి సంబంధం చూసి నిశ్చయించిపెట్టాడు, వరుడు సంస్కృతం యెమ్మే చదువుతున్నాడు, అందుకని అవధానిగారు గృహప్రవేశం తతంగమంతా తాను చేయిస్తానన్నాడు.

కట్నమక్కర్లేదు, లాంఛనాలు చాలనిపించారు బాబూ వియ్యాలవారిచేత, గట్టున పడ్డాను, అన్ని సంబారాలు తెచ్చి గృహప్రవేశం నే చేయిస్తా.

ప్రవేశం బాగానే ఉండచ్చుగానీ, నేను గంటల తరబడి పీటమీద కూచోలేను, యేమీ అందించనూ లేను, వ్రతం అభిషేకమంటూ చాలా సేపు కూచోబెడతారు అన్నాడు గడుసుగా.

అంత చాదస్తంగా చేయించను బాబూ, మీ బంధువు దంపతులు కూచుని చేస్తారు, తక్కువ టైమ్‌లో ముగిసేట్టు చేస్తా, నన్ను నమ్మండి.

అది ముగిసింది, కూలీలకు విందు, ఒక పూట కూలీ, తలా ఓ గుడ్డ ముక్క యిచ్చి చౌకగా ముగించాడు, యెలాగంటే, సంబారాలు ఫెయిర్ ప్రైస్ షాపులో తెప్పించి కూలీలనే వంట

చేసి సర్వ్ చేయమన్నాడు, తాను హోటల్‌కి ఆర్డరి స్తే మనిషికి యాభై అడిగారు, ఇపుడు సగటున మనిషికి యిరవై పడింది, వస్తువులూ మిగిలాయి, పదార్థాలూ మిగిలాయి.

ఇంక హౌస్‌వార్మింగ్ సెరిమొనీ అని టీ పార్టీ ఇవ్వాలి, ఓ రైల్వే వంటవాడు రిటైరై పూరికేనే ఉన్నాడు, చిన్న జాబ్ యిప్పించమని అడుగుతున్నాడు, ఈ లోపల టీ పార్టీకి పదార్థాలు తాను చేసి పెడతానన్నాడు, అతని కొడుకులిద్దరూ సాయం వచ్చారు, పకోడీలూ, బనారస్ కాజా, టీ, బీడా పంచారు, గిన్నెడు కాజాలూ, గిన్నెడు పకోడీలూ మిగిలాయి. హాస్టల్లో వంటవాడుగా టెంపొరరీ జాబ్ యిప్పిచాడు ధనరాజ్.

## 2

అసలు సమస్య అప్పుడెదురైంది, పనివాళ్ళు కుదరాలి, ఇల్లు శుభ్రంగా ఉంచుతూ, పూలతోట వేస్తు, యింటి లోపలా బయటా అందంగా ఉంచలేక హతమారుతున్నది.

ఇంటి పన్ను నెత్తిన పడుతుంది, అది గుర్తుంచుకుని చౌకగా పనివారికోసం చూశాడు, ఆలస్యమైనా దొరికారు, మొగుడేమో వాచ్‌మన్ పనీ, తోటమాలీ, పెళ్ళామేమో యింటి పని చేస్తుంది. ఇద్దరికీ విడివిడిగా జీతం, ఉండేందుకు యిల్లు, దీపం, నీళ్ళు, ఫ్రీ.

ఇంటి చుట్టూ ఖాళీస్థలమున్నది, మట్టి తోలించాడు, కూరలూ, ఆకుకూరలూ పండిస్తే చెరిసగం, ఒక కొబ్బరి చెట్టు కాయలు వాడుకోవచ్చు, అదీ ఒప్పందం, పిల్లలు యింటి

చుట్టూ తిరుగుతూ ఆడుకుంటారు గనక, దొంగల భయం ఉండదు, అదీ లాభం.

ధనరాజ్ స్వంత బిడ్డలేమో రెక్కలొచ్చి, స్వదేశంలో దూర తీరానికి, విదేశాలకి వెళ్ళారు. గృహిణీ తానూ యిద్దరే అయినా వచ్చిపోయేవారున్నారు.

ఇల్లు సిమాల తలుపు తీయ్ అని కాలింగ్‌బెల్ మోగించింది కూతురు, గృహిణి లేచి లైటు వేసి గోడ గడియారం వంక చూస్తే నాలుగున్నరే, తలుపు తీసింది.

కాఫీ పెట్టి దొడ్లో పెట్టు, మాయమ్మ వచ్చి గిన్నెలు తోముద్ది యిల్లు చిమ్ముతూ చెప్పింది.

రెండో కూతురొచ్చి, తడిబ్రష్ నీళ్ళలో ముంచి యిల్లు తుడుస్తున్నది.

కొడుకొచ్చి కిటికీలు తీసి బ్రష్‌తో దులుపుతున్నాడు, ఇంకో కొడుకొచ్చి సీలింగ్ ఫాన్ బ్రిష్‌తో దులుపుతున్నాడు.

వాకిట్లో యిద్దరు చిన్నపిల్లలు అన్నం అని యేడుస్తున్నారు, పోస్టులో ఉత్తరాలు వేయాలన్నాడు బాబు యిమ్మని వాచ్‌మన్ వచ్చేశాడు, పాలుపోసే అమ్మాయి వచ్చేసింది.

పాలు పోయించుకో, ఆమె పన్లోకెల్లాలట అన్నది రెండో కూతురు, తల్లి అంట్లు తోముతూ పిల్లలిద్దరికీ పప్పు అన్నం చారూ కలిపి ముందుంచింది.

సబ్బు చాలదు, సబ్బుపొడి యేయి అని కేక.

వాటర్‌మాన్ కొళాయి వదిలాడు.

నీళ్ళు పట్టుకోవాల అని పరుగెత్తారంతా, గృహిణి గొట్టం తాకించి తానూ పట్టుకుంటున్నది.

ఇలా యజ్ఞం జరుగుతుండగా, పాలు పొంగిపోకుండా, కాటు పోకుండా చూస్తుండగా, వీధిలోకెళ్ళి ఆకుకూర కొని లోపలి కొస్తుండగా యేడున్నరయింది.

అప్పుడు ధనరాజ్ మేడ దిగి వచ్చాడు, ఇల్లు ఆరలేదు, తేమ, జారుతున్నది, విసుక్కుంటూ నడిచాడు.

ఇన్ని నీళ్ళేమిటి, నేల జారుతున్నది, నువ్వు కడగ మన్నావా? ఇలా చేస్తే జారిపడమూ, మా అన్నాయి జారిపడితే ఫ్రాక్చరయింది, నిద్ర పోనీయకుండా అన్ని చప్పుళ్ళేమిటి? అలా అంటూ బాత్‌రూమ్‌లోకెళ్తే, నేలమీద నీళ్ళూ, కొళాయి వదిలేసి వెళ్ళిపోయారు.

చూడు అని గృహిణిని లాక్కెళ్ళి చూపించాడు.

నేను తిప్పలేదండీ, కొళాయి వదల్లేదు, పనివాళ్ళే వదిలి వెళ్ళారు, పోవాల పోవాల అంటూ నాలుగున్నరకే వచ్చి పన్లు మొదలెడతారు, నేను చెపితే వినరు, నాకూ నిద్రలేదు, మీరొచ్చే దాకా యజ్ఞమే.

ఒక వారం ఓపిక పట్టి ధనరాజ్ టైమింగ్స్ తానే మార్చాడు.

ఇప్పుడు తెల్లగా తెల్లారాక విడివిడిగా ఒక్కొక్కరే వచ్చి హడావిడిగా పనిచేసి పోతున్నారు.

తల్లి ఆకు కూరలు కోసి పక్కింటి వారికమ్ముతున్నది, రెండో కూతురు పూలుకోసి చుట్టుపక్కల అమ్మి చిల్లర చేసు కుంటున్నది, వాచ్‌మన్ కొబ్బరి బొండాలమ్ముతున్నాడు.

తల్లి బొచ్చె పట్టుకుని, ఆచుట్టుపక్కల యిళ్లలోపనిచేస్తున్న వారి యిళ్లలోనూ, పాలుబోసే వారియిళ్లలోనూ అన్నంకోసం ముష్టికెళ్లింది.

ఇయాల అన్నంయేయాలా. ఈడుఆకలిఅని యేడుపు. సుట్టాలొచ్చి, రేతిరివండిన అన్నమంతా తిచేసినారు. తోమేందుకు ఒట్టి బొచ్చె లేసింది అన్నమేది? అన్నది. యివరూ బొచ్చెలో అన్నం పడేయలేదు. టీ తాపించు అని తోలేశారు. వచ్చి పిల్లాణ్ణి కిందకూలేసి గిన్నెలు తోముతున్నది.

వాచ్‌మన్ నులకమంచం మెయిన్‌గేటు పక్కగా నిలబెట్టి కోళ్ళగంప తీసాడు. కోళ్లుదొడ్డంతా పరుగెత్తుతూ యింట్లోకి వచ్చాయి. కోడిపుంజు మెడరిక్కించి గట్టిగా 'కొక్కురోకో' అని అరుస్తున్నది.

రెండో అమ్మాయి మెయిన్‌గేటుకు రెండోవేపు గొఱ్ఱెనుకట్టేసింది. దానిముందు ఆకులు పోసింది. చిన్న మేకపిల్లను యెత్తుకొస్తే అది తన్నుకుని కిందికిదూకి యింట్లోకొచ్చింది. మే మే అని అరుస్తున్నది.

అపుడు పొద్దున్న తొమ్మిది గంటలైంది. ధనరాజ్ హాలులో కూచుని దినపత్రిక తిరగేస్తున్నాడు. యెదురుగా సోఫాలో ఒక ఆఫీసరున్నాడు. యేదో చెపుతున్నాడు.

వాచ్‌మన్ పెద్దకొడుకు లోపలికి వచ్చాడు,

ఆ యెదురింటి ప్యూన్ వచ్చాడు సారే! నూరు రూపాయలనోటుకి చిల్లర కావాలిట.

వాళ్ళమ వచ్చింది కొత్తిమీరీ మెంతికూరా కావాలిట వక్కింటామెకి, ఆమె పనిపిల్లను తోలింది. కోసి యివ్వనా అని అడుగుతూ నిల బడింది. చంకలోబిడ్డా,

పెద్దమ్మాయి యిల్లు చిమ్మటాని కొచ్చింది, చేతిలో కొండ చీపిరితో, ఆఫీసరునే చూస్తూనిలబడింది.

చిన్న పిల్లలిద్దరూ, ఆరుస్తూ ఒకళ్ళ నొకళ్లు జుట్టుపీక్కుం టూ, నవ్వుతూ హాలంతా గెంతుతున్నారు.

గృహిణి, డైనింగ్‌రూమ్‌లో, ఇండ్లీప్లేటు ముందుంచుకుని వక్కనే టీకప్పుతో టేబిల్ ముందున్నది.

వాచ్‌మన్ కిటికి అవతలనుంచీ సంజ్ఞలు చేస్తూ అగుపించా డు. అన్నంలేదట ఆనాడు. టిఫెనూ టీ యిస్తే డ్యూటీలో కెళ్తాడుట, జీతం అయిపోయిందిట, గృహిణిలేచి తనముందు న్నవి కిటికీగుండా అందించేసింది. ఈలోపల చివరిఅమ్మాయి డైనింగ్ రూమ్‌లో దూరి, ఫ్రిజ్ తలుపుతీసి ఐస్‌వాటర్‌సీసా తీసుకుని పరుగెత్తింది, గృహిణివెళ్ళి తలుపు మూసింది.

అలా పదిన్నరవరకూ యాగం జరిగింది.

ధనరాజ్! నేను వూళ్లోకెళ్తున్నా, పనివున్నది, ఆయనకారుతెచ్చి రమ్మంటున్నారు తలుపేసుకో, అన్నాడు నవ్వుతూ.

యెందుకు వేసుకోటం, వాళ్లంతాయింట్లోనే ఉన్నారుగా యేమీపోవు. నన్నెవడెత్తుకపోతాడు, నాపంటిమీదేంలేవు. బీరు వాలో డబ్బూలేదు. ఇంతమంది కాపలా ఉండగా, నన్ను

నైలాన్ తాడుతో గొంతుపిసికి చంపరుగదా, వీళ్లంతాహంతకు లను గుర్తుపట్టరూ?

కూడా ఉన్న అఫీసరూ నవ్వాడు.
ధనరాజ్ నవ్వి ' నీ యిష్టం ' అని వెళ్లిపోయాడు.

## 3

పెద్దకూతురు పెద్ద అయిందట, పెళ్లి చేసేయాలట, యే మైనాయిస్తారా? అనడిగాడు వాచ్‌మన్, ఇద్దరిజీతం యిమ్మని అడిగి తీసుకున్నాడు.

అప్పుడే చేయరాదు, పద్దెనిమిదేళ్ళు రావాలి.
ఇపుడేచేస్తే నేరమౌతుంది, అనినవ్వాడు ధనరాజ్.

మావూర్లో చేసేసీవస్తాము. యెవురు సూడొచ్చారు మా అప్పకొడుకేఅల్లుడు. ఆళ్ళదావూరె, సౌకగా సేసేద్దామన్నారు. అన్నాడు వాచ్‌మన్.

పెద్దగుమ్మడిపళ్లు నాలుగూ, ఇరవై కొబ్బరికాయలూ వంకాయలు రెండుకేజీలు, గోంగూర బస్తాడూ బండిలో ఉంచాడు వాచ్‌మన్.

భార్యవచ్చినది పాతచీరలు అరు కావాలని అడిగింది వాటిని మూటగట్టి బండిలో వుంచింది.

పిండిదంపి అరిశలొండాలిట, రెండురోకళ్లు కావాలన్నది పాతబిందెలు రెండు, ఒక వళ్లెం, గిళాసూ, వసుపూ కుంకుమా బెల్లం పొట్లాలుకట్టి తీసుకున్నది.

బండీ యెక్కుతూ చెప్పారిద్దరూ

పెళ్లికాగానే వచ్చేస్తాము, అందాకా యెలాగో చేసుకోండి. యెవుర్నీ పన్లో యెట్టుకోవద్దు

బండీ కదిలిపోయింది. కోళ్లూ గొఱ్ఱే మేకా అన్నీ వెళ్లి పోయాయి.

## 4

ఆరు వారాలకి వచ్చారు. పెళ్లి యెంతవైభోపేతంగా జరిగిందిచెప్పాడు వాచ్‌మన్. తీరాచూస్తేయింట్లో ఒకబ్బాయీ అమ్మాయీ అన్నివస్తూ చేస్తుకనిపించారు.

పన్లో యెవుర్నీయెట్టుగ వద్దని సెప్పెల్తిమేబాబూ మా యాలిగారు సేస్తురు. అన్నాడు వాచ్‌మన్.

ధనరాజ్ నవ్వి పెట్టుకోలేదు అన్నాడు.

మరి యీల్లెవరు ? అని నిగ్గదీశాడు వాచ్‌మన్.

వాళ్లనే అడుగు, అన్నాడు ధనరాజ్.

నేను మేనల్లుడు సునీల్‌బాబు. యెమ్మే చదవటాని కొచ్చాను. ఈ అమ్మాయి నీరజ. రిసెర్చ్ చేసుకోవాలని వచ్చింది. సెలక్టయింది. ఊరికే కూచుని తినటమెందు కని పనిచేసిపెడతాము అన్నాము. జీతంతీసుకోము. బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ చాలు అని ఒప్పందం చేసుకున్నాము. దయ చేయ్. ఇంకా నలుగురు స్టూడెంట్స్ వస్తున్నారు. వాళ్ళతోట పని బజారుపని చేసిపెడతారు. పద, అనిపోనిచ్చి వలతలుపు మూశాడు మేనల్లుడు.

— (౦) —